క్లుప్తంగా

పానగల్ గంగమ్మ ఆదాయం రూ.43,501

శ్రీకాళహస్తి: పట్టణంలో పానగల్‌లోని గంగమ్మ ఆలయానికి హుండీ ఆదాయం రూ.43,501 వచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మంగళవారం, బుధవారం పానగల్ గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించడం విదితమే. ఈ నేపథ్యంలో ఈ ఆదాయం సమకూరింది.

నవోదయకు ఎంపిక



ఏర్పేడు: మండలంలోని కోబాక ప్రాథమిక పాఠశాల 6వ తరగతి విద్యార్థి చైతన్య నవోదయకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి శుక్రవారం తెలిపారు. నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి మదనపల్లెలో సీటు పొందాడని చెప్పారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

లో ఓల్టేజి సమస్య పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కారణిమిట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో లో ఓల్టేజి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటిని కోరారు. శుక్రవారం సబ్ స్టేషన్ వద్ద కమిటీ సమావేశం నిర్వహించారు. పగటి పూట నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఇవ్వాలని, త్వరితగతిన జగనన్న లేఅవుట్‌లోని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని వినియోగదారులు కోరారు. వైస్ ఎంపీపీ మునెమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న బండి వేణుగోపాల్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన బండి వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనాంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు.

షేర్ ఈట్ పానీపూరి ప్రారంభం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో ముత్యాలమ్మగుడి వీధిలోని ఐఫ్రూట్ నిర్వాహకులు నూతనంగా ఏర్పాటు చేసిన షేర్ ఈట్ పానీపూరి దుకాణాన్ని తొట్టంబేడు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. దుకాణ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.


పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం



పిల్లలకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ ఇందిరాదేవి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ ఇందిరాదేవి హాజరై విద్యార్థులతో అక్షరమాల రాయించారు. అనంతరం యువతేజం ట్రస్ట్ వ్యవస్థాపకులు కరీముల్లా ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు దేవసేన, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసన్న, కరకంబాడి హైస్కూల్ హెచ్‌ఎం బాలాజి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు మెటీరియల్ పంపిణీ



ఎన్‌సీసీ క్యాడెట్లకు మెటీరియల్ అందజేస్తున్న సునీత

ఏర్పేడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు యూనిఫాం కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్‌లో యూనిఫామ్‌తోపాటు షూస్, టోపీ, టై మొదలైనవి ఉన్నట్లు ఆమె చెప్పారు. తమ స్కూలులో నాలుగేళ్లుగా ఎన్‌సీసీ కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, సేవాతత్పరత గుణాలు పెంపొందించడానికి ఎన్‌సీసీ ఒక సాధనంగా దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఓ లావణ్యలక్ష్మి, క్యాడెట్లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం





పూజలు చేస్తున్న వేదపండితులు, (ఇన్‌సెట్) ప్రత్యేకాలంకారంలోస్వామి అమ్మవార్లు



ధ్వజారోహణం

శ్రీకాళహస్తి: స్థానిక చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కలశస్థాపన, హోమపూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద భక్తుల గోవిందనామ స్మరణ నడుమ ధ్వజారోహణం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, బియ్యపు శ్రీవాణిరెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. తొలుత ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి పుర ఉత్సవం వేడుకగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

నందీశ్వరుడిపై పరాశరేశ్వరుడి విహారం



నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో శుక్రవారం సాయంత్రం నంది వాహనాన్ని ఉత్సవమూర్తులు అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయంలో వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు వితరణ చేశారు. దేవేరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా నాగరాజు



నాగరాజు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారిగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హర్షవర్ధన్ ఉద్యోగోన్నతిపై జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి వెళ్లారు. నాగలాపురం పీహెచ్‌సీ నుంచి నాగరాజు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంగమ్మ

ఏర్పేడు: విద్యార్థులు పెద్ద చదువులు చదివి, మంచి ఉద్యోగాలు పొంది, ఉన్నత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ ఆకాంక్షించారు. శుక్రవారం మండలంలోని నాగంపల్లె ఎస్‌ఓఎస్ బాలల గ్రామంలో ఫౌండర్ హెర్మన్ మెయినర్ జయంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. ఎస్‌ఓఎస్ ఆధ్వర్యంలో పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతోందన్నారు. తల్లిదండ్రులులేని పిల్లలకు భోజనం, వసతి సౌకర్యాలతోపాటు మంచి విద్యను అందిస్తున్న ఎస్‌ఓఎస్ బాలల గ్రామాన్ని అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసంత, ఎస్‌ఓఎస్ బాలల గ్రామం డైరెక్టర్ ప్రదీప్, ఎస్‌ఓఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారక రామానగర్‌లో శుక్రవారం టాటాట్రస్ట్, రాస్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించి వైద్యపరీక్షలు చేశారు. టాటా ట్రస్ట్ ప్రతినిధులు, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు తగదు



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్

రేణిగుంట: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరోపణ చేయడం అర్థరహితమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. రేణిగుంటలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ, ఎమ్మెల్యేను రాజకీయంగా ఎదుర్కోలేక భూ వివాదాల్లోకి లాగాలని చూడటం హేయమన్నారు. చౌకబారు ఆరోపణలు మానుకోకుంటే వచ్చే ఎన్నికల్లో మరింత ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. ఎస్టీ సామాజికవర్గానికి చెందిన తహసీల్దార్ శివప్రసాద్‌పై కూడా కించపరిచే విధంగా మాట్లాడటం ఆయనకు నిమ్నజాతులపై ఉన్న వివక్షకు తార్కాణమన్నారు. వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం పాల్గొన్నారు.

రాచపాళెంలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు



కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న ఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్ తదితరులు

సత్యవేడు: రాచపాళెంలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటుకు పంచాయతీ పరిధిలోని కమ్యూనిటీ హాల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. గురువారం ఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, అసిస్టెంట్ ఏఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్ కేడీ.పార్థసారథి, ఎంఈఓ-1 కే.రవితో కలసి పరిశీలించారు. కమ్యూనిటీ హాలు ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటుకు అనువుగా ఉండడంతో వారం లోపు పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రూబెన్, సీఆర్పీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జేసీబీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి- పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గం రాజీవ్‌నగర్‌లోని గిరిజన గురుకుల కళాశాల సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. శ్రీకాళహస్తి తహసీల్దార్ రూప్‌చంద్ ఆదేశాల మేరకు రాజీవ్‌నగర్ వీఆర్వో విజయకుమార్ జేసీబీతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణానికి గాను తహసీల్దారు కార్యాలయంలో పట్టా చూపించాలని, తహసీల్దారు పరిశీలించి అనుమతించాకే పనులు చేపట్టాలన్నారు. నిజమైన పట్టాదారుడు తప్ప రాజీవ్‌నగర్‌లో ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వెలుగులు నింపేలా జగనన్న పాలన



జంగాలపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంగూరు సచివాలయ పంచాయతీ శివగిరిపల్లె, జంగాలపల్లె, శ్రీనివాసపురం, ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 315 కుటుంబాలను కలిశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. 4 ఏళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాలువలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యేకు నివేదించారు. సమస్యలను పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజల కష్టాలు ఎరిగిన ప్రభుత్వం

ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల కష్టాలు ఎరిగిన ప్రభుత్వం తమదేనన్నారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు జగనన్న కాలనీలు నిర్మిస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, సర్పంచ్ బొర్రా నారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మాజీ ఎంపీటీసీ కూనాటి రమణయ్య, పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, శేషాచలం, కృష్ణయ్య, వెంకటనారాయణ, గోవర్ధన్‌రెడ్డి, వేణు, పరమాల చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ అలంకార మండపానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



హోమ పూజల్లో అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలో బీపీ అగ్రహారంలోని నడివీధి గంగమ్మ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో అలంకార మండపం నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి భూమి పూజ చేశారు. రూ.10లక్షలతో ఎమ్మెల్యే సహకారంతో ఈ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండపం పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం స్థానిక నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. హాజరైన మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పసుపు, కుంకుమ, జాకెట్లు, గాజులు మొదలైనవి అందజేశారు. కార్యక్రమంలో రత్నంరెడ్డి, కృష్ణారెడ్డి, ఆర్కాడ్ శంకర్, భరత్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, రవికుమార్, కందస్వామిశెట్టి, లక్ష్మీపతిరెడ్డి, ఆర్కాడు మురళి, ముత్తు, కృష్ణారెడ్డి, మునికృష్ణారెడ్డి, మున్నా, జయశ్యామ్, బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లో శుక్రవారం వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమి పూజ చేశారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అంజూరు మాట్లాడుతూ, వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పులి శ్రీకాంత్, గఫూర్, బాలిశెట్టి నరసింహులు, నాగాలమ్మవీధి యూత్ పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, మోహన్‌కృష్ణ, అమర్‌నాథ్, వేలు, మాధవ తదితరులు పాల్గొన్నారు.

యల్లంపల్లె గిరిజనకాలనీలో 'మళ్లీ బడికి'



ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, సచివాలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: మండలంలోని యల్లంపల్లెలో శుక్రవారం మళ్లీ బడికి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రగతి సంస్థ, సర్పంచ్ వనమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డ్రాపౌట్స్ తల్లిదండ్రులతో సమావేశమై చదువు ప్రాముఖ్యతను వారికి వివరించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, ఇందుకు ప్రజల సహకారంతో కృషి చేస్తామన్నారు. పల్లం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాడు - నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న వసతి దీవెన తదితర కార్యక్రమాల ద్వారా మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, మానిన పిల్లలను బడిలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ఓ వరం



బుచ్చినాయుడుకండ్రిగ : మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు



సత్యవేడులో...

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష ఓ వరమని ఎంపీడీఓ నరసింహారావు అన్నారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు భాగస్వాములై దీనిని విజయవంతం చేస్తే సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్ష అమలుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి, మిగిలిపోయిన సమస్యలను గుర్తించి, వివిధ సేవలు అందజేసి పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తారన్నారు. వారం పాటు వలంటీర్లు ఇలా ఇంటింటికీ వెళ్లి సమస్యలను నమోదు చేసి, వాటిని సచివాలయంలో తెలియజేయాలన్నారు. 1వ తేదీన అయా సచివాలయాల పరిధిలో నమోదైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నా. సచివాలయ సిబ్బంది, వలంటీర్లను పర్యవేక్షించేందుకు మండల శాఖ అధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మునిరత్నమ్మ, సురుటుపల్లె దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ, ఈఓపీఆర్డీ రాజశేఖర్, ఎంఎల్‌ఓ ప్రసాద్, గ్రామ కార్యదర్శి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: అర్హత ఉండి ఇప్పటి వరకు సంక్షేమం అందని కుటుంబానికి ×జగనన్న సురక్ష×తో లబ్ధి చేకూర్చాలని మండల జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు అన్నారు. మండలంలోని భీమునిచెరువు, కొండల చెరువు సచివాలయాలలో శుక్రవారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు మురుగేశం, భూపాల్‌రెడ్డి, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీఓ, సత్యవేడు సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, ఏఓ రమణ కుమార్, ఈఓపీఆర్డీ ముని రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ శివయ్య రెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం స్వర్ణలత, ఉపాధి హామీ ఏపీఓ కృష్ణయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు

వరదయ్యపాళెంలో..


వరదయ్యపాళెం: జగనన్న సురక్షతో సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నా అన్నారు. శుక్రవారం మండలంలోని కారిపాకం, మత్తేరిమిట్ట, బత్తలవల్లం సచివాలయాల్లో గ్రామ వలంటీర్లకు జగనన్న సురక్ష పథకం గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఓ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు లోకేశ్వరి, సింధు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, ఎంపీటీసీలు మధుసూదనరావు, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..


పిచ్చాటూరు: జూలై 4 నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సచివాలయాల వారీగా షెడ్యూల్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం విడుదల చేశారు. విడుదల చేశారు. జూలై 4న పులికుండ్రం, 6న గోవర్ధనగిరి, 11న కారూరు, 13న కీళపూడి, 15న పిచ్చాటూరు, 18 ముడియూరు, 20న రామాపురం, 22న ఎస్‌ఎస్‌బి పేట, 25న వెంగళత్తూరు, 27న రామగిరి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రావు, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, నాయకులు చలపతిరాజు, చెంగల్రాయ రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత సీఎం కార్యక్రమాన్ని వీక్షించారు.

ఏర్పేడులో..


ఏర్పేడు: జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో శుక్రవారం లాంఛనంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని అన్నిసచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, ఎంపీడీఓ గిడ్డయ్య, ఏఓ షణ్ముగం, హౌసింగ్ ఏఈ ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



నారాయణవనం : మాట్లాడుతున్న కోనేటి బాబు



వరదయ్యపాళెం : మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ చిన్నా



పిచ్చాటూరులో..

ఎస్సీ, ఎస్టీ అధికారుల జోలికొస్తే రాజకీయ సన్యాసమే

రేణిగుంట: ఎస్సీ, ఎస్టీ అధికారుల జోలికొస్తే టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డికి రాజకీయ సన్యాసం తప్పదని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు చిందమాకుల పుణ్యమూర్తి హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఎల్లమండ్యంలో మీడియాతో మాట్లాడారు. తహసీల్దార్ తలచుకుంటే వేలాది కోట్ల రూపాయలు ప్రభుత్వ భూములను ధారాదత్తం చేయవచ్చా..? అని ప్రశ్నించారు. వీఆర్వో నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ వ్యవస్థ ఉందని తెలిపారు. ఏవైనా అక్రమాలు జరిగినట్లు ఆధారాలుంటే చట్టపరంగా వెళ్లాలేగానీ నిమ్నజాతులకు చెందిన అధికారులను టార్గెట్ చేసి, రాజకీయ లబ్ధి పొందాలని చూడటం దుర్మార్గమన్నారు.